సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం ၊ 6 ၊ ఆగస్టు ၊ 2023



చీనీ టన్ను రూ.16,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి. మార్కెట్‌కు 796 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టీబీ డ్యాంలో 84 టీఎంసీల నీరు
తుంగభద్ర డ్యాంలో 84.761 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 11,777 క్యూసెక్కులు కొనసాగుతోంది. హెచ్చెల్సీకి 2,455 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.

గరిష్టం/కనిష్టం
36.2°/22.4°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పురం' రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- 'అమృత్ భారత్'కు ఎంపిక చేసిన ప్రభుత్వం



హిందూపురం అర్బన్: సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్ పరిధిలోని హిందూపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఈ రైల్వే స్టేషన్‌ను ప్రభుత్వం 'అమృత్ భారత్' కింద ఎంపిక చేసింది. దీంతో 'పురం' స్టేషన్‌కు రూ.20 కోట్లు అందనుండగా, ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ప్లాట్‌ఫాంపై టైల్స్, వెయిటింగ్ హాలు, ఎస్కలేటర్, ఉచిత వైఫై, ఎలక్ట్రిక్ లైటింగ్ తదితర సౌకర్యాలు సమకూరనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

లోగో, మస్కట్ రూపకల్పనకు పోటీలు

ప్రశాంతి నిలయం: 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించిన లోగో, మస్కట్ రూపకల్పనలో విద్యార్థులకూ భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఇందుకోసం పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు 'ఆడుదాం ఆంధ్ర' మస్కట్, లోగో రూపొందించి https://www.sports.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈఓ కార్యాలయం ఏడీ ఈ-2 రామకృష్ణ సూచించారు. ఎంపికైన లోగో, మస్కట్‌లకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, తృతీయ బహుమతి కింద రూ.20 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారన్నారు.

ప్రత్యామ్నాయానికి సన్నద్ధం

- వర్షాభావం.. తగ్గిన ఖరీఫ్ సాగు విస్తీర్ణం
- ప్రస్తుతం 66 వేల హెక్టార్లలో వివిధ పంటలు
- ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



భూమిని సిద్ధం చేసుకుంటున్న రైతు

25,368 క్వింటాళ్లు
ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయశాఖ పంపిన విత్తన ప్రతిపాదనలు

90% ఉలవలకు ఇచ్చే సబ్సిడీ

90,000 ఉలవ సాగు అంచనా (హెక్టార్లలో)

పుట్టపర్తి అర్బన్: వర్షాభావంతో ఖరీఫ్ పంటల సాగు బాగా తగ్గింది. జూన్‌లో తొలకరి పలకరించినా ఆ తర్వాత వరుణుడి జాడ లేకపోయింది. జూలైలో తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసినా అప్పటికే అదును దాటిపోయింది. ఫలితంగా ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. ముఖ్యంగా పెద్దపంట వేరుశనగ 51,374 హెక్టార్లకే పరిమితమైంది. మిగతా పంటలన్నీ కలిపినా 66 వేల హెక్టార్లలోనే సాగులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

66 వేల హెక్టార్లలో పంటల సాగు

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,84,032 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకూ 66 వేల హెక్టార్లలోనే (23.25 శాతం) వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో వేరుశనగ 51,374 హెక్టార్లలో సాగులో ఉండగా, కందులు 5,483, రాగి 1,869, మొక్కజొన్న 4,495, సజ్జ 487, వరి 202, పొద్దుతిరుగుడు 189, పత్తి 1,351, మిరప 354, ఆముదం 247, జొన్న 142, కొర్ర 29, ఉలవలు 151 హెక్టార్లు, ఇతర పంటలతో కలిపి మొత్తంగా 66,032 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

కరుణించని వరుణుడు

జిల్లా రైతులు ఖరీఫ్‌లో జూలై 15వ తేదీలోపే వేరుశనగ, కంది విత్తేందుకు ఇష్టపడతారు. ఈ సమయంలో విత్తనం వేస్తేనే దిగుబడి బాగుంటుందన్నది రైతుల నమ్మకం. ఈ గడువు దాటితే పంట వేయరు. ఈసారి జూన్, జూలై నెలల్లో ఆశించిన వర్షపాతం నమోదు కాలేదు. జూన్ సాధారణ వర్షపాతం 66.6 మి.మీ కాగా, 46.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 19.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక జూలై సాధారణ వర్షపాతం 70.9 మి.మీ కాగా, 21.8 శాతం లోటుతో 49.1 మిమీ వర్షపాతం నమోదైంది. ఈ నెలలో ఇప్పటి వరకూ చినుకు జాడ లేదు. దీంతో జిల్లాలోని 25 మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసి అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపింది.

ఉలవ సాగు విస్తీర్ణం పెంచేలా...

ఉలవ, పెసర, అలసంద, తదితర పంటల సాగును ప్రోత్సహించేలా వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులోనూ రైతులకు రెండు రకాలుగా మేలు చేసే ఉలవ సాగు విస్తీర్ణం బాగా పెంచాలని భావిస్తోంది. ఇందుకోసం ఏకంగా 90 శాతం సబ్సిడీతో ఉలవలు అందించేందుకు సిద్ధమైంది. ఉలవలు పండితే రైతులు విక్రయించుకోవచ్చు. అలాగే ఉలవ తీగలు పశువులకు, జీవాలకు మేతగానూ ఉపయోగపడతాయి. ఇక తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న 25 మండలాల్లో సుమారు 90 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉలవ సాగులోకి వచ్చేలా 22,551 క్వింటాళ్ల విత్తనం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇప్పటికే కందులు, రాగులు ఉచితంగా అందజేశారు.

చర్యలు తీసుకుంటున్నాం



"ఈ సీజన్‌లో జిల్లాలో ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో రైతులు వేరుశనగ, కంది పంటలు సాగు చేయలేకపోయారు. ప్రత్యామ్నాయంగా ఉలవ, పెసర, అలసంద పంటలు లక్ష హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు 25,368 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఉలవ సాగుచేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తాం." - సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళిక ఇలా...

మండలం	ప్రతిపాదిత విస్తీర్ణం(హెక్టార్లు)	విత్తనాలు (క్వింటాళ్లలో)
మడకశిర	4,811	1,230
అమరాపురం	5,386	1,350
కనగానపల్లి	6,500	1,626
రామగిరి	3,600	900
సీకేపల్లి	7,000	1,750
గాండ్లపెంట	2,564	641
ముదిగుబ్బ	5,220	1,305
నల్లమాడ	4,561	1,090
ఓడీచెరువు	3,132	783
కొత్తచెరువు	6,071	1,520
బుక్కపట్నం	5,334	1,335
రొద్దం	6,112	1,530
పెనుకొండ	2,428	610
సోమందేపల్లి	2,495	625
పుట్టపర్తి	6,075	1,520
ఎన్‌పీ కుంట	2,500	626
తలుపుల	2,000	500
కదిరి	1,931	484
అమడగూరు	1,000	250
నల్లచెరువు	2,050	513
గోరంట్ల	4,100	1,025
తాడిమర్రి	3,500	875
ధర్మవరం	7,000	1,750
బత్తలపల్లి	3,520	880
తనకల్లు	2,600	650
మొత్తం	1,01,490	25,368

దిగొస్తున్న టమాట ధరలు

- కిలో గరిష్ట ధర రూ.90



అనంతపురం అగ్రికల్చర్: కొద్ది రోజులుగా తారెత్తించిన టమాట ధరలు శనివారం కాస్త తగ్గాయి. క్రమంగా మార్కెట్‌కు సరుకు పెరుగుతుండటంతో ధరలు దిగొస్తున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా కక్కలపల్లి మండీలో 1,000 టన్నుల అమ్మకాల మార్క్‌ను అధిగమించింది. శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.90 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 1,050 టన్నుల సరుకు అమ్మకానికి రాగా.. వాటిని బహిరంగ వేలం వేశారు. కిలో గరిష్ట ధర రూ.90, కనిష్టం రూ.55, సరాసరి రూ.73 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయని తెలిపారు.

9 నుంచి 'నా మట్టి-నా దేశం'



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: దేశభక్తిని చాటేందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఈనెల 9వ తేదీ నుంచి 'నామట్టి - నాదేశం' కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ చేతన్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. శనివారం వారు కలెక్టరేట్‌లో 'నామట్టి - నాదేశం', 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని యువత, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 9న అమరులైన పోలీసులు, జవాన్ల పేర్లతో కూడిన శిలాఫలకాల ప్రదర్శన, 10న ప్రజలతో పంచ్ ప్రాన్ ప్రతిజ్ఞ చేయించి సెల్ఫీలు తీసుకోవడం, 11న 'వసుధ కు వందనం' కింద మొక్కలు నాటడం, 14వ తేదీన 'వీరులకు వందనం' కింద అమరులైన త్రివిధ దళాల సైనికుల కుటుంబీకులను, విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబీకులను సన్మానించాలన్నారు. 15న జాతీయ జెండాల ఆవిష్కరణ, 16 నుంచి 20వ తేదీ వరకూ మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతుడు నాగరాజు

కనగానపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన నాగరాజు(42), తన భార్య అమలతో కలసి పెనుకొండ సమీపంలోని కొగిర గ్రామానికి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో మామిళ్లపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో ద్విచక్ర వాహనం పైనుంచి దంపతులిద్దరూ కిందపడ్డారు. నాగరాజు తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అమలను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారులకు వ్యాక్సిన్ వేయించండి



మాట్లాడుతున్న వాణీమోహన్

ముదిగుబ్బ: ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ నెల 7 నుంచి జరిగే 'మిషన్ ఇంద్రధనస్సు' కార్యక్రమంలో వ్యాక్సిన్ వేయించాలని కమిషనర్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ వాణీమోహన్, డీఎంహెచ్ఓ ఎస్వీ క్రిష్టారెడ్డి సూచించారు. శనివారం మలకవేమల క్రాస్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

చంద్రబాబుపై క్రిమినల్ కేసులు పెట్టాలి

- ఉనికి కోసం కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగం
- అధికార దాహంతో అశాంతికి ఆజ్యం
- అల్లర్లకు పూర్తి బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ/ పెనుకొండ రూరల్: పుంగనూరులో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పిన చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శనివారం ఆయన మండలంలోని మావటూరులో, పెనుకొండలోని ఏడీసీసీ బ్యాంక్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు అశాంతికి ఆజ్యం పోస్తున్నారని, ఆయన చర్యలతోనే పుంగనూరులో విధ్వంసకాండ జరిగిందన్నారు. కేవలం రాజకీయంగా తన ఉనికి చాటుకోవడం కోసం చంద్రబాబు టీడీపీ కార్యకర్తలను పోలీసులపైకి ఉసిగొల్పారన్నారు. అలాగే శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసులను చులకన చేస్తూ మాట్లాడటం ఆయన దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబు ఓ ప్రతిపక్ష నాయకుడి టూర్‌కు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో కూడా తెలియదా.. అని ప్రశ్నించారు. పుంగనూరు బైపాస్ మీదగా చిత్తూరు వెళ్లాల్సిన చంద్రబాబు.. అనుమతి లేక పోయినా, భద్రతా సిబ్బంది నిలువరించినా పనిగట్టుకొని పుంగనూరులోకి ప్రవేశించాలని ప్రయత్నించడం ముమ్మాటికీ తప్పేనన్నారు. తనకు ఎన్ఎస్‌జీ కమాండోలు ఉన్నారని పదేపదే చెప్పిన చంద్రబాబు...అంతటి భద్రత కలిగిన వ్యక్తి ఎక్కడ పర్యటించినా 24 గంటల ముందే సంబంధిత జిల్లా ఎస్పీకి రూట్ మ్యాప్ పంపాలన్న ఇంగిత జ్ఞానం లేదా... అని ప్రశ్నించారు. కేవలం తన ఉనికి చాటుకోవడం కోసం టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి, అల్లర్లకు ప్రేరేపించారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలతో ప్రజలంతా ఆయన వెంట నడుస్తున్నారని, దీన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు ఎలాగైనా సరే పెద్దిరెడ్డి కుటుంబంపైనే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా బురదజల్లాలన్న ఉద్దేశంతోనే గొడవలకు ప్లాన్ చేశాడన్నారు. పుంగనూరు ఘర్షణలకు మూల కారణం ముమ్మాటికీ చంద్రబాబే అన్నారు.

రక్షకులపై నిందలు తగదు బాబూ

నిత్యం పోలీసుల రక్షణలో తిరిగే చంద్రబాబు తన స్వార్థం కోసం బాధ్యతతో పనిచేసే పోలీసులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కదిరి సభలో జిల్లా ఎస్పీని, పుంగనూరు వద్ద డీఎస్పీ స్థాయి అధికారులను కించపరిచేలా మాట్లాడటం చూస్తే అతను ఎంత దిగజారాడో తెలుస్తుందన్నారు. గొడవలకు ప్రేరేపించి ఎందరో పోలీసులు గాయపడేందుకు కారణమైన చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ద్వారా డీజీపీని కోరుతామన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని గౌరవప్రదంగా నడుచుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, నాయకులు రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ నాగరాజు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'కు నోటీసులు

- అనుమతుల్లేకుండా 'ప్రీ ప్రైమరీ' నిర్వహిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలోని ప్రీ ప్రైమరీ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న ఎంఈఓ జాన్ రెడ్డప్ప

ప్రశాంతి నిలయం: విద్యాశాఖ అనుమతుల్లేకుండా ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించే పాఠశాలల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తచెరువు మండల విద్యాధికారి-1 జాన్ రెడ్డప్ప హెచ్చరించారు. 'ప్రీ ప్రైమరీ' పేరుతో మూడేళ్లు కూడా నిండని చిన్నారులను రోజంతా తరగతి గదుల్లో ఉంచి తరగతులు నిర్వహిస్తున్న వైనంపై 'బాల్యం బందిఖానా' శీర్షికతో శనివారం 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన విద్యాశాఖ అధికారులు శనివారం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రీ ప్రైమరీ పాఠశాలను తనిఖీ చేశారు. అనుమతులు లేవని తేలడంతో నోటీసులు జారీ చేశారు. తరగతులు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో శాంతిభద్రతలకు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా జిల్లాలో నెల రోజుల పాటు (సెప్టెంబర్ 5వ తేదీ వరకూ) 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనధికార బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులతోపాటు ఇతర కార్యక్రమాలపై నిషేధం విధిస్తున్నామన్నారు. ఒకవేళ తప్పనిసరై జన జీవనానికి, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలగకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలనుకున్నప్పటికీ, 48 గంటల ముందే పోలీసుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అంత్యక్రియలకు, వివాహ ఊరేగింపులకు ఈ నిబంధనలు వర్తించవన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 77వ స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఆర్ఓ కొండయ్యతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 15వ తేదీ అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ పతాకం ఆవిష్కరణ కచ్చితంగా జరపాలన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండులో జరిగే వేడుకలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హాజరై పతాకావిష్కరణ చేస్తారన్నారు. ప్రకారం ముందుగానే ఆహ్వాన పత్రికలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్ఓను ఆదేశించారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను సమాచార శాఖకు సమర్పించాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక ఏర్పాటులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే కార్యక్రమానికి విచ్చేసే వీఐపీ, మీడియా, అవార్డు గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే విద్యార్థులకు ముందుగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. నవరత్నాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల జాబితాలను అన్ని శాఖలు ఈనెల 7వ తేదీలోపు పంపాలన్నారు.

అందరూ చేనేత దుస్తులను ధరించాలి

జాతీయ చేనేత దినోత్సవమైన ఆగస్టు 7వ తేదీన అందరూ తప్పనిసరిగా చేనేత దుస్తులే ధరించి చేనేతలను గౌరవించాలని కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా 1905 ఆగస్టు 7న విదేశీ దుస్తులను బహిష్కరించాలని స్వదేశీ దుస్తులను ధరించాలని భారతీయులంతా ఉద్యమం చేపట్టారన్నారు. అప్పటి నుంచి భారతీయులు రాట్నంపై వడికిన దుస్తులను ధరిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారన్నారు. వారి స్ఫూర్తితో ఉద్యోగులు, వారి కుటుంబీకులు, కార్మికులు, రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఆగస్టు 7వ తేదీన చేనేత దుస్తులను ధరించాలని కోరారు.

ఆకట్టుకున్న యూకే విద్యార్థుల నాటిక

ప్రశాంతి నిలయం: మానవతా విలువల అవశ్యకతను వివరిస్తూ సమస్త లోకా సుఖినో భవంతు పేరుతో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. పర్తియాత్రలో భాగంగా యూకే నుంచి వచ్చిన సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవతా విలువలు మానవాళిని ఎలా రక్షిస్తాయో వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది.





గురు వందన కార్యక్రమంలో విద్యార్థులు



నాటికలోని సన్నివేశాలు

ముగిసిన టీటీ పోటీలు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మూడు రోజులుగా సాగుతున్న రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి హాజరై, మాట్లాడారు. నవోదయ విద్యాలయలో చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ చదవడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. ప్రిన్సిపాల్ నాగరాజు, విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ వి.నాగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

అనంతపురం: సెప్టెంబర్ 9న అన్ని కోర్టులలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల కలెక్టర్, ఎస్పీలు, పోలీసు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. పోక్సో బాధితులకు పరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి డీఆర్వో కొండయ్య, ఎస్పీ మాధవరెడ్డి, అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతికి అనువైన వేరుశనగ వంగడాలు అభివృద్ధి చేయాలి

- జాతీయ వేరుశనగ పరిశోధనా స్థానం డైరెక్టర్ ఎస్‌కే బేగ్



బేగ్‌కు స్వాగతం పలుకుతున్న శాస్త్రవేత్తలు

కదిరి అర్బన్: అధిక నూనె శాతం కలిగి ఎగుమతికి అనువైన, తక్కువ కాలవ్యవధి కలిగిన వేరుశనగ వంగడాలను అభివృద్ధి చేయాలని గుజరాత్‌లోని జాతీయ వేరుశనగ పరిశోధనా స్థానం డైరెక్టర్ ఎస్‌కే బేగ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోతోందన్నారు. దీంతో ఎగుమతికి అనువైన వంగడాలను అభివృద్ధి చేసి సాగు విస్తీర్ణం పెంపునకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. వివిధ తెగుళ్లు, కీటకాలను తట్టుకోగల వేరుశనగ జన్యు సంపదను పరిశీలించి వాటి ద్వారా కొత్తరకాలను కనుగొనాలన్నారు. కదిరి పరిశోధనా స్థానం దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించడంపై హర్షం వ్యక్తం చేశారు. విత్తనోత్పత్తిలో జాతీయ అవార్డు పొందినందుకు శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వ్యవసాయ పరిశోధనా స్థాన ప్రగతిని ప్రధాన శాస్త్రవేత్త డా. సంపత్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసన్న రాజేష్, వేమన, చంద్రాయుడు, నీలిమ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.